క్లుప్తంగా

భవానీ భక్తుడికి గాయాలు


గోపాలపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న భవానీ భక్తుడు శ్రీనివాస్

నల్లజర్ల: కాలినడకన విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళుతున్న భవానీ మాలధారులను బైక్ ఢీకొట్టింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామయ్యపాలెంకు చెందిన నలుగురు భవానీ మాలధారులు గురువారం రాత్రి పాదయాత్రగా వెళుతున్నారు. అనంతపల్లి శివారు వీరవల్లి టోల్ ప్లాజా సమీపంలో అతి వేగంగా వచ్చిన బైక్ వారిని వెనుక నుంచి ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో శ్రీనివాస్ అనే భవానీ మాలధారునికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే కొండాస్వామి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన శ్రీనివాస్‌ను గోపాలపురం ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు.ఈ ప్రమాదానికి కారకుడైన తెలికిచెర్లకు చెందిన బైకిస్టు మిద్దే సుకుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్టు నల్లజర్ల సీఐ శ్రీనివాస్ తెలిపారు.

వంట నూనెల విక్రయ దుకాణం ప్రారంభం


వంట నూనెల దుకాణాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: ప్రభుత్వ వంట నూనెల విక్రయ దుకాణాన్ని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ శుక్రవారం ప్రారంభించారు. స్థానిక కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఈ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయిస్ డీటీ ఎం.అనిల్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక అయిల్ కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కౌంటర్‌లో 850 గ్రాముల పామాయిల్ రూ.110కు, 910 గ్రాముల సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124 రేటుకు విక్రయిస్తారన్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ పట్టణ శాఖల అధ్యక్షులు రంగా రమేష్, కొమ్మిన వెంకటేశ్వరరావు, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సదస్సు విజయవంతం చేయాలి

నిడదవోలు: వివిధ కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 18న నిర్వహించనున్న కార్మిక సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. స్థానిక యర్నగూడెం రోడ్‌లోని పశువుల ఆసుపత్రి కూడలిలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఫ్టు కార్యకర్తలు లంకాడ గణపతి, పిచ్చా సూర్యకిరణ్, కోనేటి మల్లేశ్వరరావు, ముప్పిడి ప్రకాశం, వెంకట్రావు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లకు మోక్షం ఎప్పుడో..?

- నేటికీ తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- నియోజకవర్గంలో 35,817 మందికి పెన్షన్ల పంపిణీ


నిడదవోలు మండలం గోపవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్ (ఫైల్)

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి దాదాపు నాలుగు నెలలు కావస్తోంది. ఇంతవరకూ కొత్త పింఛన్ల మంజూరుపై కార్యాచరణ రూపొందించలేదు. అక్టోబర్ 1 నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వంలోని నాయకులు ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ, ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు సంబంధం లేకుండా వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం పింఛన్లు మంజూరుపై ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత పాలన నుంచి ఇప్పటి వరకూ అర్హత ఉన్న లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. కొత్తగా ఒక్కరికి కూడా పింఛను ఇవ్వలేదు. అయితే 100 రోజుల పాలన ముగియడంతో ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేస్తుండడంతో ఇదెక్కడి విడ్డూరమని ప్రజలు సర్వత్రా చర్చించుకుంటున్నారు. నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల పరిధిలో ప్రతి నెలా 35,817 మందికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా..

వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గ్రామాల్లోని సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో అర్హులు వెళుతున్నారు. నూతన పెన్షన్ల కోసం ప్రభుత్వ వెబ్‌సైట్ తెరవకపోవడంతో వారంతా నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది. దీంతో పింఛన్లు ఎప్పుడు ఇస్తారో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో నూతన పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రి దుర్గేష్‌కు విన్నవించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పెన్షన్లు మంజూరు కాకపోవడంతో సమాధానం చెప్పలేక గ్రామాల్లో తిరగలేకపోతున్నామన్నారు.

గతంలో పక్కాగా పథకాల అమలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి పథకం పక్కాగా అమలయ్యేది. పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే అందించేవారు. ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సార్వత్రిక ఎన్నికల్లో నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఆగిన వెబ్‌సైట్ కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు అవుతున్నా నేటికీ ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులకు సచివాలయాల సిబ్బంది సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు.

తొలగించేందుకు కుట్ర



కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు. ప్రస్తుతం వస్తున్న పింఛన్లను ఎలాగైనా తొలగించాలని కూటమి పార్టీల నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. త్వరలో గ్రామసభలు పెట్టి అనర్హత పేరుతో పింఛన్ల తొలగిస్తారని సాగుతున్న ప్రచారాలతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఏ నెలకు ఆ నెల పింఛన్ 3వ తేదీలోగా తీసుకోకపోతే పింఛన్ కట్ చేస్తున్నారు. పింఛన్ల పంపిణీ సమస్యలను పరిష్కరించి, ఇప్పటికైన ప్రభుత్వం నూతన పింఛన్ల మంజూరు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

– బయ్యే కృష్ణబాబు, ఎంపీటీసీ సభ్యుడు, తాళ్లపాలెం, నిడదవోలు మండలం

కాపవరంలో ఆటో చోరీ

పెరవలి: ఇంటి వద్ద ఉంచిన ఆటో రాత్రి వేళ అపహరణకు గురైంది. గత నెల 28వ తేదీ రాత్రి మండలంలోని కాపవరం గ్రామంలో ఈ చోరీ జరిగింది. చోరీకి గురైన ఆటో కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన జంగా చంద్రశేఖర్‌ది. ఆయన కొంతకాలం క్రితం ఈ ఆటోను పెరవలి మండలం, కాపవరం గ్రామానికి చెందిన చిత్తూరి రమేష్‌కు అద్దెకు ఇచ్చాడు. రమేష్ గత నెల 28వ తేదీ పగలంతా ఆటో నడుపుకుని, రాత్రి తన ఇంటి వద్ద ఉంచి నిద్రపోయాడు. మరునాడు లేచి చూసేసరికి ఆటో అక్కడ లేదు. దాంతో ఆటో చోరీపై రమేష్ గురువారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెరవలి ఎస్ఐ పి.అప్పారావు కేసు నమోదు చేశారు.

భవానీ భక్తులకు అత్యవసర షెల్టర్లు

కొవ్వూరు టౌన్ సీఐ విశ్వం


పి.విశ్వం, పట్టణ సీఐ, కొవ్వూరు

కొవ్వూరు: దసరా మహోత్సవాల సందర్భంగా భవానీ దీక్ష బూని కాలినడకన విజయవాడ వెళ్లే భవానీ భక్తులకు రోడ్డు మార్గంలో అత్యవసర షెల్టర్ జోన్లు ఏర్పాటు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాలినడకన వెళుతున్న భవానీ భక్తులు ప్రమాదాలకు గురవుతున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కచ్చితంగా రోడ్డుకు ఎడమ వైపున మాత్రమే నడవాలని సూచించారు. రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వరకూ జాతీయ రహదారి అయినందున భక్తులు కచ్చితంగా సర్వీసు రోడ్డులోనే నడవాలన్నారు. జాతీయ రహదారిపై కొవ్వూరు–కాతేరు మధ్య గల గామన్ బ్రిడ్జి జీరో పాయింట్ వద్ద, కొవ్వూరు టోల్‌ప్లాజా, దేవరపల్లి డైమండ్ జంక్షన్, ఏడీబీ రోడ్డు కలవచర్ల జంక్షన్, అనంతపల్లి టోల్ ప్లాజాల వద్ద భవానీ భక్తుల సౌకర్యార్థం తాగునీరు, విశ్రాంత షెల్టర్లు ఏర్పాటు చేశామన్నారు. నడక మార్గంలో ఎ వెళ్లే భక్తులు వీటిని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. హైవేలపై నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే ఆగి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.


వీరవల్లి టోల్ ప్లాజా వద్ద పోలీసులు ఏర్పాటు చేసి మంచినీరు, విశ్రాంతి శిబిరం

నల్లజర్ల: విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి కాలినడకన వెళ్లే భవానీ మాలధారులకు అనంతపల్లి శివారు వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద నల్లజర్ల పోలీసులు మంచి నీరు, విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. సెల్‌ఫోన్ చార్జింగ్‌లకు ఏర్పాటు చేసినట్టు ఏఎస్ఐ మోహనరావు తెలిపారు.ఈ రహదారిపై పాదయాత్రగా వెళ్లే మాలధారులు ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ

జాయింట్ కలెక్టర్ చినరాముడు


చాగల్లు రైస్‌మిల్లులో రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ చినరాముడు

చాగల్లు: రైతులకు ఇబ్బందులు కలగకుండా ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు నిర్దిష్ట ప్రణాళిక రూపొందించినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చినరాముడు తెలిపారు. మండలంలోని చాగల్లు రైస్ మిల్‌ను శుక్రవారం జేసీ చినరాముడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామన్నారు. ఈనెల 14 నుంచి తుపాను హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో ముందుగానే రైతులను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమకు నచ్చిన రైస్‌మిల్‌లో ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని చెప్పారు. తహసీల్దార్ ఎం.మెరికమ్మ, ఏవో కె.వేణుగోపాలకృష్ణ, సివిల్ సప్లై ఆర్ఐ సునీత, సొసైటీ కార్యదర్శి కె.శ్రీను, రైతులు ఆత్మూరి గోపి, పి.గంగరాజు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జయజయహే మహిషాసుర మర్దిని

- కోటసత్తెమ్మకు ప్రత్యేక పుష్పాలంకరణ
- 425 మంది దంపతులతో సహస్ర నామ కుంకుమ పూజలు
- మహిషాసుర మర్దినిగా దుర్గామాతకు అలంకారం
- నేడు విజయదశమి పర్వదినం


తాళ్లపూడిలో మహిషాసుర మర్దిని అలంకారంలో అమ్మవారు


బ్రాహ్మణగూడెంలోని కనకదుర్గమ్మకు..


తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో సహస్ర నామ కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

నిడదవోలు రూరల్: విజయ దశమి పల్లెల్లో,పట్టణాల్లో సందడి తీసుకు వచ్చింది. దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేసిన భక్తులు శనివారం విజయ దశమి పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. పాఠశాలలకు సెలవులు రావడంతో విద్యార్థులు ఇళ్ల వద్ద సందడి చేస్తున్నారు. మహిళలు పూజల్లో మునిగి తేలుతున్నారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేస్తున్నారు. చివరి రోజు భక్తులకు విజయదుర్గగా అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. మరోవైపు భవానీ మాల ధరించిన భక్తులు విజయవాడకు వివిధ వాహనాల్లో దుర్గమ్మ దర్శనానికి పయనమయ్యారు.

ప్రత్యేక సహస్ర నామ కుంకుమ పూజలు

తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారిని 9వ రోజు శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 425 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణ, హోమాలు నిర్వహించారు. దాతల తోడ్పాటుతో దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు చక్కెర పొంగలి పులిహోర ప్రసాదంగా పంపిణీ చేశారు. వివిధ రూపాల్లో అమ్మవారికి రూ.2,87,236 ఆదాయం వచ్చినట్టు ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాశ్ తెలిపారు. అలాగే గోపవరంలో గుబ్బాలమ్మ, తాడిమళ్ల గౌడవీధిలో దుర్గాదేవి విగ్రహాలను ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించి కుంకుమ పూజలు జరిపించారు. సమిశ్రగూడెంలోని పుంతలో ముసలమ్మ, డి.ముప్పవరంలో కొండాలమ్మ, ముత్యాలమ్మ, లోహియానగర్‌లో కనకదుర్గమ్మ, కంసాలిపాలెంలో దేవీ పాటెమ్మ అమ్మవార్లు మహిషాసుర మర్దినీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దేవరపల్లి: మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికాదేవిని, బాలదుర్గమ్మ వారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం రాత్రి సెమీ పూజతో ఉత్సవాలు ముగియనున్నాయి.

తాళ్లపూడి: స్థానిక నవదుర్గాది పరివార శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మకు శుక్రవారం మహిషాసుర మర్దినీదేవి అలంకారం చేశారు. అర్చకుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన, పల్లకీ సేవ నిర్వహించారు. అలాగే స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని గాయత్రీమాత మందిరంలో పరస రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేగేశ్వరపురం మేదరపేటలోను, మలకపల్లి కనకదుర్గమ్మ ఆలయంలోను, అన్నదేవరపేట, బల్లిపాడు, తాడిపూడి, గజ్జరం, పోచవరం, పెద్దేవం, పైడిమెట్ట గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని భవానీ మాలధారులు దుర్గామాత దర్శనానికి విజయవాడ తరలి వెళ్లారు.

చాగల్లు: స్థానిక మాతంగి చెరువు గట్టుపై గల అమ్మవారిని మహిషాసుర మర్దినీదేవిగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. స్థానిక ధనలక్ష్మి అమ్మవారిని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. మీనానగరంలోని ముత్యాల దిబ్బవద్ద గల అమ్మవారికి భవానీలు, మహిళలు పూజలు చేశారు. బ్రాహ్మణగూడెంలోని నాగారమ్మ వారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు. భజనలు, కుంకుమ పూజలు చేశారు. గ్రామంలోని భవానీలు నిప్పులగుండం తొక్కి తమ భక్తిని చాటుకొన్నారు. రావుల చెరువు గట్టుపై గల కనకదుర్గమ్మ గుడి వద్ద అమ్మవారి కథ కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని భవానీ మాలధారులు విజయవాడ తరలి వెళ్లారు.

ఆలయాల్లో కుంకుమ పూజలు

పెరవలి: మండలంలోని ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం పెరవలి, ముక్కామల, వెంకట్రాయపురం, కానూరు గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల వద్ద, మంటపాల వద్ద శుక్రవారం వేకువజాము నుంచే మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే అన్నవరప్పాడు శక్తమ్మ తల్లి ఆలయం వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు, వ్రతాలు ఆచరించారు.కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, పెరవలి గ్రామాల అమ్మవారి ఆలయాలను వందలాది భక్తులు దర్శించుకున్నారు.

పాలంగిలో చండీహోమం

ఉండ్రాజవరం: మహర్నవమి సందర్భంగా శుక్రవారం పాలంగిలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా చండీహోమం నిర్వహించారు. ఆలయ మేనేజర్ ఎంవీ రామయ్య దంపతులు, భక్తుల ఆధ్వర్యంలో అర్చకుడు వి.రఘు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య చండీహోమం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కార్యక్రమాన్ని వీక్షించారు. పలు గ్రామాల్లో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఉండ్రాజవరం, మోర్త గ్రామాల్లోని కనకదుర్గమ్మ, వేలివెన్నులోని కొండాలమ్మ, కె.సావారంలోని ముత్యాలమ్మ ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు

- నిడదవోలు సర్కిల్‌లో 19 షాపులకు 861 దరఖాస్తులు
- కొవ్వూరు సర్కిల్‌లో 16 షాపులకు 714

నిడదవోలు: ఎక్సైజ్ నిడదవోలు సర్కిల్ పరిధిలోని 19 మద్యం షాపుల లైసెన్సు కోసం 861 మంది దరఖాస్తు చేసుకున్నట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ ఆర్‌జే సతీష్‌బాబు శుక్రవారం తెలిపారు. దరఖాస్తుకు చివరి రోజైన శుక్రవారం కూడా దరఖాస్తులు భారీగానే వచ్చాయి. షాపుల లైసెన్సు కోసం ఒక్కో దరఖాస్తుదారు రూ.2 లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించారు. నిడదవోలు టౌన్‌లో 191 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిడదవోలు మండలం నుంచి 213, ఉండ్రాజవరం మండలం నుంచి 207, పెరవలి మండలం నుంచి 250 దరఖాస్తులు వచ్చాయి.

కొవ్వూరు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 16 మద్యం దుకాణాల అనుమతుల కోసం 714 దరఖాస్తులు దాఖలైనట్టు ఎక్సైజ్ సీఐ కె.సత్యనారాయణ తెలిపారు. వాటిలో ఆన్‌లైన్ ద్వారా 239, ఆఫ్‌లైన్ ద్వారా 475 దరఖాస్తులు అందాయన్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ రుసుము ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.14.28 కోట్ల మేర ఆదాయం సమకూరినట్టు తెలిపారు. కొవ్వూరు పట్టణంలో మూడు దుకాణాలకు ఏకంగా 133 మంది దరఖాస్తు చేసుకున్నారు. కొవ్వూరు మండలంలోని ఐదు దుకాణాలకు 207, చాగల్లు మండలంలోని నాలుగు షాపులకు 192, తాళ్లపూడి మండలంలో నాలుగు దుకాణాలకు 182 మంది దరఖాస్తు చేసుకున్నట్టు వివరించారు. ఈనెల 14న డ్రా పద్ధతిలో దుకాణాలను కేటాయించనున్నట్టు ఆయన ప్రకటించారు.